# కుప్పిలి పద్మ



# శీతవేళ రానీయకు

# కుప్పిలి పద్మ

శీతవేళ రానీయకు...

SEETAVELA RANEEYAKU (writings in Vaatha daily during 1997-98) by KUPPILI PADMA. First publication: June, 1999. Second publication: 14th October, 2009. © KUPPILI PADMA. Copies 1000. Cover design and illustrations LAXMAN. Photo credit NOVA. Publication MUKTA PUBLICATIONS. Cover printed at PRAGATHI ART PRINTERS. Composed and designed at AKSHARA CREATORS. Printed at NAVYA PRINTERS. For copies KUPPILI PADMA, 201, Vijayalaxmi Apartments, Methodist Colony, Begumpet, Hyderabad - 500 016. VISALANDHRA BOOK HOUSE, Bank Street, Hyderabad & its branches. NOVADAYA BOOK HOUSE, Kachiguda, Hyderabad. DISA PUSTAKA KENDRAM, Chikkadpally, Hyderabad.

Rs. **100.**

kuppilipadma@yahoo.com    kuppilipadma@gmail.com
www.kuppilipadma.com

వుద్రేకాలూ స్పర్శారాహిత్యమూ లాలసా మోహమూ సందిగ్ధాలూ
What not... వొకానొక కాలంలో నా అవ్యక్త ఆనంద విషాదాలు
యీ శీతవేళ రానీయకు...

- కుప్పిలి పద్మ
వైశాకం తొలి వర్షపు రాత్రి
ప్రమాధి

అనగనగా వొక ఆమె.

ఆమె కన్నులలో అనంతాంబరపు నీలినీడలు కలవు.

ఆమె నిగూఢ.

కష్టాల విషభాండాన్ని గుండెల్లో దాచుకుని చిరునవ్వులు చిందించగలదు. ఆమె కళ్ళకింద నల్లటి చారలు. ఆమెనెవ్వరూ అర్థం చేసుకోరు. ప్రపంచాన్నంతా జయించిన పురుషుడయినా ఆమె హృదయాన్ని మాత్రం చదవలేడు.

ఆమె గతం వొక రహస్యం. ప్రపంచం చేసిన గాయాల సంపుటి. ఆమె వ్యక్తిత్వం చుట్టూ విషాదం కాంతివలయంలా ఆవరించి వుంటుంది. ఆమెను అందుకోగలమని అర్రులు సాచిన వారందరూ తమను తాము అల్పులుగా గుర్తించి

వినయంగా వెనుదిరుగుతారు, అందినంత అందుకుని.

మీనాకుమారి, గీతాదత్, మార్లిన్‌మన్రో, సావిత్రి....

యిదొక కుట్ర

లోకం తాను స్త్రీలమీద మోపుతున్న క్రౌర్యపు భారాన్ని సగర్వంగా తలకెత్తుకోవడానికి వారిపై విసురుతున్న విలువల వల.

అతనికి అన్నీ తెలుసు. నాగరికతలు నిర్మించడం, ఆయుధాలు కని పెట్టడం, రాజ్యాలు కూల్చడం, యేడేడు సముద్రాల ఆవలినుంచి గులేబకావళిని కోసుకురావడం... అన్నీ తెలుసు.

యిన్ని తెలిసిన అతనికి మనమీద విలువల వల విసరటమూ తెలుసు. వాటన్నిటినీ మనం నమ్ముతూ వచ్చాం. ఆ వల నుంచే మనం కనిపించినంతమేరా లోకాన్ని చూస్తూ వచ్చాం. నిజంగా మన హృదయాలు సముద్రమంత లోతా!?

లోతైన సముద్రంలో యేయే వింతలున్నాయో చూడటానికి కూబాడైవ్స్ (Scubadives) కనిపెట్టిన అతను మన అంతరంగంలో యేముందో తెలుసుకోవాలని యెప్పుడైనా ప్రయత్నించాడా? వూహూ! మనలోపల యే కణాన్ని తడిమినా వాళ్ళ లోకం చేసిన గాయాల చెమ్మ తగుల్తుందని అతనికి భయం.

అతడు యుద్ధ బీభత్సం గురించి తాత్వికమైన సంశయవేదనని మాత్రమే

ప్రకటించి గీతాజ్ఞానంతో సంతృప్తి చెందగలడు. కురుక్షేత్రంలో యుద్ధవిరామపు రాత్రుళ్ళలో శవాలను వెదుక్కుంటూ రోదించే ద్రౌపదికీ, గాంధారికీ యేభగవానుడూ వూరటనివ్వడు.

వాళ్ళ మనసుకి కష్టం వేస్తేనో, ప్రేమ భగ్నమైపోతేనో, పెళ్ళాం లేచిపోతేనో వెంటనే గడ్డం పెంచేసుకోవచ్చు. యే మందుషాపుకో పరిగెత్తొచ్చు. యే చంద్రముఖినో వెతుక్కుంటూ వెళ్ళొచ్చు. యివి యేవీ చాలకపోతే హిమాలయా లున్నాయి. కాషాయం వుంది. కమండలం వుంది. కానీ మనకే కష్టం వస్తే...?

వైరాగ్యం మాట అటుంచి కనీసం తలచుకొని తలచుకొని యేడ్చే అవకాశం కూడా దొరకదు.

దేవదాసు దొరకని దుఃఖం మనసుకి యింకక ముందే తనకంటే పెద్ద వాళ్ళయిన పిల్లలకి తల్లి బాధ్యత తీసుకోవల్సి వస్తుంది.

'దేముడు నిన్ను చల్లగా చూస్తాడు పార్వతీ' అని సి.ఎస్.ఆర్. తలపై చెయ్యివేసి ఆశీర్వదిస్తుంటే నవ్వలేక యేడ్వలేక నవ్వనే నవ్వాలి. యే భగవానుడూ రాడు. యే చంద్రముఖుడూ కనిపించడు.

మనం గుంభనులంకాక యేమవుతాం?!

వాళ్ళు గుట్టుగా వుంటే రిజర్వ్‌డ్‌గా వున్నారనో, మూర్తీభవించిన తాత్వికులనో లోకం మెచ్చుకుంటూ మేధావులంటుంది.

చాలా తక్కువమంది మాత్రమే మన 'మార్మికత'కు అర్థాన్నిస్తారు.

'ఆమె ప్రేమిస్తుందో లేదో' అని వాళ్ళు వాళ్ళలోనే బోల్డన్ని వూహాచిత్రాలని వూహిస్తారు. కానీ నోరువిప్పి చెప్పరు.

అతనికి ఆమె వొక ప్రహేళిక.

అతను సృష్టించుకున్న యీ అమానుష ప్రపంచానికి బోల్డన్ని నియమాలు, హద్దులు. సహనాన్నో, చంచలత్వాన్నో, పాతివ్రత్యాన్నో మూసపోసి అందులోంచి చూస్తాడతను. అతనికేమీ కనిపించదు. ఆ కనిపించని అంధత్వానికే ముద్దు పేరు పెట్టి కిరీటంగా తగిలిస్తాడు.

ఆ కిరీటం మొయ్యటం బాధాకరం. మొయ్యటానికి బోల్డంత శక్తిని వెచ్చిస్తున్నాం. ఆ కిరీటాన్ని పక్కకు పెట్టి కాసేపు పురుషవ్యాకరణంలో మాట్లాడ దామని మనం ప్రయత్నించేసరికి గగ్గోలు మొదలైంది.

యెవరి రహస్యాలని యెవరి గుట్టుని చప్పుడుకాకుండా వుంచడానికి యే విలువలకి ఆచ్ఛాదన యివ్వడానికి మనం మన శక్తిని వుపయోగిస్తున్నాం? వేనవేల దుఃఖాలని మునిపంట భరించే శక్తిని, నవ్వుతూ అగ్నిప్రవేశం చేసే నిబ్బరాన్ని మనం మన కోసమే వాడుకుంటామంటే - వ్యక్తిగతం రాజకీయమేనని నిగూఢతను వదులుకునే సరికి నిప్పురాజుకుంది.

యెవరి అత్యాశలకీ మనోవికారాలకీ మన మనసులు సేఫ్ డిపాజిట్ లాకర్లు కావని స్పష్టం చేస్తే పురుష ప్రపంచం బేజారైపోవచ్చు. కానీ మనకి మోయలేని యీ ముళ్ళ కిరీటం వదిలిపోతుంది.

భూదేవంత దుఃఖభారాన్నో, వుద్వేగాలనో మనలోనే దాచుకొనేసరికి మనం హిస్టీరియా పేషంట్లమి కావొచ్చు. పాషాణమైనా అవుతాం. ఆత్మహత్యలనైనా వరిస్తాం. ఆరాధ్య దేవతలమైనా అవుతాం.

యీ బిరుదులు, పూజలు, వుచ్చులు మనం వదిలించుకుంటే నిప్పుల కొలిమిలో కూడా నిలబడగలిగే శక్తి మనలో మిగిలే వుంటుంది. ఖాళీ చేసిన నిగూఢత స్థానంలో అంతకు వేలరెట్ల సృజనాత్మకతతో మన మనసులు నిండిపోతాయి. ఆ శక్తితో యెన్నెన్ని కొత్త విజయాలు సాధిస్తామో, యెన్ని కొత్త ఆవిష్కరణలు చేస్తామో కదా!

శోధించి ప్రయత్నించి తెలుసుకోదగ్గ రహస్యాలేమీ లేని తెరచిన పుస్తకంలా మనం మారిపోతే అందులో కనిపించే తన వికృత ప్రతిబింబాన్ని చూసి వొక నిగూఢమార్మిక యేకాంతంలోకి జారుకోవటమో, మరుగునపడిపోవటమో - అతని యిష్టం.



నీలికళ్ళు, నల్లనికళ్ళు, బ్రౌన్ ఐస్, పచ్చనికళ్ళు, - కలువరేకల్లా వున్నా, మీన నేత్రాలైనా, అరమోడ్పు కళ్ళైనా, యే రంగులో వున్నా, యే ఆకారంలో వున్నా watery eyes అందమైనవి. కనులకొలకుల్లోకి నీళ్ళునిండి వొక కన్నీటి బొట్టు చెక్కిలి మీదకి జారుతుంది. అనంతాకాశం నుంచి రాలిపడే తొలకరి చినుకులా. చినుకు వెంట చినుకు ముంచెత్తినట్టే కన్నీటి వరద ముంచెత్తుతుంది. వాన కురిసినప్పుడు నేల మాళిగలోంచి మట్టి పరిమళం యెగిసిపడ్డట్టే దుఃఖంలో తడిసినప్పుడు చెంపల మీంచి కన్నీటి పరిమళం గుప్పుమంటుంది. యేడ్చి యేడ్చి అలసిన కళ్లు తేటపడ్డ ఆకాశంలా మెరుస్తుంటాయి.

యేడుపు అనగానే అందరికి మనమే గుర్తొస్తాం. యేడుపు మన సొత్తు అనుకుంటారు. పైగా యేడ్చే మగాణ్ణి - నమ్మొద్దంటారు. కాని యేడవటానికి ధైర్యం కావాలి. ప్రేమవుండాలి, కోపంవుండాలి. కళ్ళు చెమ్మగిల్లేంత ప్రేమని అనుభవించాలి. అటువంటి ఆ ప్రేమని యే మగాడైనా అందుకుంటున్నాడా? ప్రేమ సఫలమైనప్పుడు ఆనందాశ్రువులతోనూ, ప్రేమ విఫలమైనప్పుడు విషాదాశ్రువులతోనూ యెవరైనా యేడవగలుగుతున్నారా? 'చెట్టునెక్కగలవా, పుట్టనెక్కగలవా వో నరుడా' అంటే యెక్కి చూపిస్తారేమో కానీ 'నా ముందు నిలబడి భోరున యేడుస్తావా' అంటే యేమైపోతారో యీ అభినవ ప్రేమికులు!

మనం యేడవగలం. యెక్కడైనా, యెప్పుడైనా మనం మాత్రమే కన్నీరు కార్చగలం. యింటర్నేషనల్ యేర్‌పోర్టులోనైనా కన్నీళ్ళు పెట్టుకోగలిగే ధైర్యం మనకే వుంది. వరదలూ, వుప్పెనలూ, భూకంపాల వంటి విషాద సందర్భాలు యేర్పడినప్పుడు, ఆప్తుల్నీ, ఆస్తుల్నీ కోల్పోయినప్పుడు భోరున విలపిస్తూ స్త్రీలూ పిల్లలే కనిపిస్తారు. పురుషుల మొహాల నిండా బాధ వుంటుంది కానీ కళ్ళలో నీరుండదు. మగాళ్ళ యేడుపు గ్రంథులన్నీ వట్టిపోయాయా? మగాళ్ళకి యేడుపురాదని కాదు. వాళ్ళు యేడవలేరని కాదు. వాళ్ళు రోజూ యేడుస్తారు. క్షణక్షణం యేడుస్తుంటారు. ఆ యేడుపులు వేరు. ఆ యేడుపుల్ని పట్టుకోవడానికి మనం పెద్దగా కష్టపడక్కర్లేదు. అయితే మొసలి కన్నీళ్ళేవో, మనసు కన్నీళ్ళేవో పోల్చుకోవడానికి మనం అప్రమత్తంగా వుండాలి. 'నాకూ నా భార్యకీ పడదు. నా భార్య వల్ల మనశ్శాంతి కరువవుతోందని' యేడుపుగొట్టు మొహాలతో తిరిగే మగాళ్ళుంటారు. వాళ్ళు ప్రతి పరిచయస్తురాలి దగ్గరికీ వెళ్ళి 'నీ వొడిలో కొంచెం చోటివ్వు. యేడుస్తాను. నాకు మనశ్శాంతి ప్రసాదించు' అని ప్రాధేయపడుతుంటారు. అలాంటి మగాళ్ళనీ, వాళ్ళ యేడుపునీ అనుమానించాల్సిందే! జాగ్రత్తపడాల్సిందే!! 'యింటికి దీపం యిల్లాలు. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. యింటిపనితోనే నువ్వు అలసిపోతున్నావు. మళ్ళీ వుద్యోగాలూ,

ఆఫీసులూ యెందుకు? యేడు మల్లెల యెత్తు నా రాకుమారీ'' అంటూ యేడుపు కళ్ళతో జోలపాటో, జాలిపాటో యెత్తుకుంటే తప్పకుండా అనుమానించాల్సిందే!

మగాళ్ళకి యేడుపులు యెన్నెన్నో.

బస్సుల్లో మనకి ప్రత్యేకమైన సీట్లున్నాయని యేడుపు. రైలు టికెట్లు కొనుక్కోవడానికి ప్రత్యేక కౌంటర్లున్నాయని యేడుపు. కాలేజీలలో, వుద్యోగాలలో రిజర్వేషన్లున్నాయని యేడుపు. పత్రికల్లో ప్రత్యేక పేజీలున్నాయని యేడుపు. చీర కట్టుకోలేదని యేడుపు. రాజకీయాలలో నిర్ణయాధికారం కావాలంటే 'పార్లమెంట్ బాబ్డ్‌హేర్ స్త్రీలతో నిండిపోతుందని' యేడుపు.

యేడవండి యేడవండి.

శత్రువెవరో తెలిస్తే కన్నీళ్ళు తుడవటమూ, కళ్ళనీళ్ళు తుడుచుకోవటమూ తేలిక.

వీరులు శూరులు ధీరోదాత్తులు గ్రీకువీరులు వాళ్ళు యెవరైనా కావొచ్చు. మల్లికా సారాభాయ్ అన్నట్టు 'బ్లేళ్ళ అడ్వర్టయిజ్‌మెంట్లలోనూ, సిగరెట్ అడ్వర్టయిజ్ మెంట్లలోనూ ఫోజులిచ్చే మగవాళ్ళను చూస్తే మహా చిరాకు. యేం మగతనం అది. వొక్కసారి గట్టిగా యేడ్వలేరు. పైగా 'మీరు మనసార యేడ్వనీరు నన్ను' అని లోకం మీద నింద వేస్తారు. మహా అయితే 'యేకాంతయవనికాభ్యంతరమునవెక్కివెక్కి' రోదించాలని చూస్తారుకాని బయటపడి వొక్క కన్నీటిచుక్కా రాల్చలేరు పాపం. గండ శిలల గర్భంలో కూడా వొక నీటిచారిక వున్నట్టు పురుషుల హృదయాలలో కూడా యెక్కడో తడి మిగిలే వుంటుంది. కుళ్ళుబోతు ఏడుపులు మేటవేసి కన్నీటి గ్రంథులకు అడ్డుపడి వుంటాయి. పూడిక తీసుకోవటమో పాషాణంగా మిగిలిపోవటమో పురుషోత్తముల యిష్టం.

✧



వాళ్ళు వస్తారు.

అలసిపోయి సొలసిపోయి వస్తారు.

జీవితంలో యుద్ధం చేసి గెలిచో వోడిపోయో వస్తారు.

మీసాలు దువ్వుకుంటూ విజయగాథల్ని చెప్పడానికి వస్తారు.

గాయాల్ని ప్రదర్శించి వోదార్పు పొందడానికి వస్తారు.

మూటగట్టుకు వచ్చిన వాంఛల్ని మన మీద చల్లి చల్లార్చుకోవడానికి వస్తారు.

వచ్చి, మళ్ళీ వెళ్ళిపోతారు.

మొగుళ్ళయినా, ప్రియుళ్ళయినా, సన్యాసులైనా, వీరులైనా, పరదేశులైనా, బాటసారులైనా, యెవరైనా సరే-

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=1516](http://kinige.com/kbook.php?id=1516)**

* * *

**Read other boos of Kuppili Padma @**

**[http://kinige.com/kbrowse.php?via=author&name=Kuppili+Padma&id=495](http://kinige.com/kbrowse.php?via=author&name=Kuppili+Padma&id=495)**